
# ఇదేం వరసరా మొగుడా!

ఎ.కె.వి. రత్నమాల



వేడిపాలల్లో యా… …ఆపొడి కలుపుతుంటే ఒళ్ళు ఝల్లుమంది మృదులకి. ఆ పాల గ్లాసుతో తను మంచం దగ్గరకి చేరుకోగానే జరగబోయేది తల్చుకుంటుంటే ఆమెకి ఒళ్ళంతా పులకలు తేలింది. ఉద్వేగంతో వణికే చేతుల్ని అదుపులో పెట్టుకుని, పాలగ్లాసు తీసుకుని ముందుకి కదిలింది. తొలిరేయి తీపి అనుభవాల్ని నెమరేసుకుంటూ తరబడుతున్న అడుగుల్తో బెడ్ రూం వైపు నడిచింది.





మధురోహల్తో బరువెక్కిన మనసుతో, బెడ్‌రూంలోకి ప్రవేశించడం కోసం కుడికాలు ఎత్తి లోపల పెట్టబోయిన ఆమె, గదిలోంచి వినపడుతున్న పాటకి అదిరిపోయి, ఎత్తిన పాదాన్ని ఎత్తినట్టే చటుక్కున వెనక్కి లాక్కుంది.

''ఆగదు ఏ నిమిషం నీ కోసమూ

ఆగితే సాగదు ఈ లోకమూ..ముందుకు సాగదు ఈ లోకమూ..'' విషాదం మిళితమైన బాలసుబ్రహ్మణ్యం గొంతు బరువుగా వచ్చి, బలంగా ఆమె చెవుల్ని తాకుతోంది. ఆ పాటలోని అర్థానికీ, బాధకీ మృదుల మనసంతా అదోలా అయిపోయింది. క్షణం క్రితం వరకూ తియ్యని పులకరింతల్లో ఉన్న ఆమె శరీరం కాస్తా, బెడ్‌రూంలోని టేప్‌రికార్డర్‌లోంచి వస్తున్న ఆ పాటకి తెలియని జలదరింపుల్తో నిండిపోయింది.

'శుభమా అంటూ భర్త సమాగమం కోసం బయల్దేరితే..మధ్యలో ఇదేంపాట?' అనిపించింది.

ఒక్క క్షణం, ఏం చెయ్యాలో అర్థంకానట్టు పెదవి కొరుక్కుంటూ అక్కడే నిలబడిపోయింది.

ఆ మరుక్షణం మళ్ళీ అనిపించింది. ఏవేవో ఆలోచిస్తూ గడపకి ఇవతలే నిలబడిపోయి టైం వేస్ట్ చేసుకునే కంటే, తెగించి గదిలోకి వెళ్ళి అసలు జరిగిందేమిటో తెలుసుకోవడం మంచిది... అని! అప్పుడు..గబ గబా లోపలికి నడిచింది. ఆమె వెళ్ళే

సరికి సుభాష్ ఈ లోకంలో లేడు. తలకింద చేతులు పెట్టుకుని, మంచం మీద వెల్లకిలా పడుకుని, కళ్ళు మూసుకుని, తన్మయత్వంతో పాట వింటున్నాడు.

''మరణం తథ్యమనీ..ఏ జీవికి తప్పదనీ..తెలిసినా..మృత్యువూ రాక ఆగదూ..'' హృదయ విదారకమైన మ్యూజిక్‌తో కలిసి బాలు గొంతు వినిపిస్తుంటే, మృదులకి వెన్నులోంచి ఒణుకు పుట్టుకొచ్చింది. హడావిడిగా వెళ్ళి టేప్ రికార్డర్‌ని ఆఫ్ చేసేసింది.

హఠాత్తుగా పాటాగి పోవడంతో ధ్యానభంగమైన యోగిలా కళ్ళు తెరిచాడు సుభాష్. ఎదురుగా మృదుల కనిపించింది. ఆమెని చూసి చిన్నగా నవ్వాడు. ''వచ్చేశావా!'' అన్నాడు. ఆ అనడంలో అటు ఆమె వచ్చినందుకు ఆనందంకానీ, ఇటు..ఆమె అంత ఆలస్యంగా వచ్చినందుకు అలకగానీ లేనేలేవు.

ఏ భావమూ లేకుండా అతి మామూలుగా మాట్లాడుతున్న అతన్ని వింతగా చూసిందామె. ఆ తర్వాత... గాఢంగా నిట్టూర్చి, పాల్గ్లాసు అతనికి అందించింది.

''ఇప్పుడొద్దులే. తర్వాత తాగుతాను'' అన్నాడతను. అప్పుడు కూడా ఆ స్వరంలో ఏ భావమూ ధ్వనించలేదు. మరోసారి నిట్టూర్చి గ్లాసుని టేబిల్ మీద పెట్టేసింది మృదుల.

ఆ తర్వాత..ఇంకేమీ మాట్లాడలేదతను. కొంచెం సేపు ఏదో ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాడు. ఆమెకి మాత్రం అతనితో చాలా మాట్లాడాలని వుంది. తమకి శోభనం అయిన మర్నాడే వచ్చిన ఆషాఢమాసం గురించి, తద్వారా తమ మధ్య ఏర్పడిన ఎడబాటు గురించి, ఆ ఎడబాటులో తాననుభవించిన్న బాధ గురించీ, కథలు కథలుగా చెప్పాలని ఉంది. కానీ అతని మనస్తత్వం ఎలాంటిదో తెలియకపోవడం వల్ల, అవన్నీ మాట్లాడటానికి ఆమె ధైర్యం సరిపోలేదు.

నిజానికి వాళ్ళ పెళ్ళిచూపులు సాంప్రదాయం ప్రకారమే జరిగాయి. ఆ సందర్భంగా ఆమె అందరు ఆడపిల్లల్లా తలొంచుకుని కూర్చుంటే, చాలా మంది సగటు పెళ్ళికొడుకుల్లాగే సుభాష్ ఆమెని చూశాడు. ఆ తర్వాత పెద్దలు మాట్లాడుకోవడం, నెల తిరక్కుండానే వాళ్ళకి పెళ్ళయిపోవడం, శోభనం అయిన మర్నాటి నుంచే ఆషాఢం రావడం, అప్పుడు సైతం ఉత్తరాల్లో కూడా సుభాష్ ఆమెని పలకరించకపోవడం..ఇదుగో ఇలాంటి కారణాల వల్లే మృదులకి అతనంటే ఏమిటో అర్థం కాకుండా పోయింది. పోనీ తనే ఓ అడుగు ముందుకేసి అతన్ని 'స్టడీ' చెయ్యాలనుకుంది. కానీ ఆ ప్రయత్నాల్ని ఆమె తల్లిదండ్రులు సాగనివ్వలేదు. ''ఈ విషయం నలుగురికీ తెలిస్తే బావుండదు' అంటూ మృదులని భయపెట్టి వెనక్కిలాగారు.

అంత జరిగినా ఆమె నిరాశపడలేదు 'పోనీలే..శ్రావణమాసం రాగానే, కాపురానికి వెళ్ళిన తర్వాత ఏ తెరలూ లేకుండా అన్నీ ఒక్కసారే మాట్లాడేసుకోవచ్చు' అని తనకి తాను సర్దిచెప్పుకుంది కానీ..తనొచ్చి పది గంటలు పైనే అయినా అతన్తో మాట్లాడ్డం కుదర్లేదు. కారణం ఆమె కాదు. అతనే! ఊరి నుంచి వచ్చిన క్షణం నుంచీ భార్య ఎన్నిసార్లు పలకరించాలని ప్రయత్నించినా ఆ ప్రయత్నాన్ని ఎందుకో అతను సాగనివ్వలేదు. అప్పుడు కూడా..అది సిగ్గో, లేక మొహమాటమో అయ్యుంటుందన్న ఉద్దేశంతో ఆమె ఊరుకుండిపోయింది.

జరిగిందంతా గుర్తు తెచ్చుకునేసరికి ఆమె నుంచి అప్రయత్నంగానే ఓ దీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది. అది..అతని చెవిన పడింది. తల తిప్పి భార్య వైపు చూశాడు. ఏదో ఆలోచిస్తూ కనిపించిందామె. ఆమెనలా చూస్తుంటే అతనికి కర్తవ్యం గుర్తుకొచ్చింది. నెమ్మదిగా దగ్గరికి జరిగాడు. అతని ప్రయత్నం గమనించేసరికి ఆమెకి ఒళ్ళు ఝల్లుమంది. మెల్లగా భార్య భుజం మీద చెయ్యేసి మెత్తగా వత్తాడు. మృదులకి ఒంట్లోని నరాలన్నీ జివ్వుమన్నాయి. సిగ్గుగా అనిపించింది. చటుక్కున తలొంచుకుని మోకాళ్ళ మీద గడ్డాన్ని ఆన్చుకుని కాలి పట్టాల వైపు చూసుకుంటూ ఉండిపోయింది.

''ఇక పడుకుందామా?'' ఆమె చెవి దగ్గర నోరు పెట్టి గుసగుసలాడాడతను. ఒళ్ళంతా వెచ్చని ఆవిర్లు కమ్ముకున్నాయి మృదులకి. అతని గుసగుసలకి సమాధానంలా వెనక్కి వాలిపోయిందామె. ఆమెతో పాటు అతను కూడా!

''ఏదైనా మాట్లాడు'' అనాచ్ఛాదితంగా కనిపిస్తున్న ఆమె పొట్టమీద చెయ్యేస్తూ అన్నాడతను.

ఆ స్పర్శ ఆమెని వివశురాల్ని చేసింది. పరవశంగా కళ్ళు మూసుకుంది.

అప్పుడు గుర్తొచ్చింది. తను అతన్తో చాలా మాట్లాడాలని. ''ఏం మాట్లాడనూ?'' అంది అక్షరం అక్షరం కూడబలుక్కుంటూ.

''ఏదో ఒకటి'' ఆమె పొట్టమీదున్న చేతిని కొద్ది కొద్దిగా పైకి జరుపుతూ అన్నాడు.

జరగబోయేదేమిటో గ్రహింపుకొచ్చేసరికి ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి. కళ్ళు అరమోడ్పులయ్యాయి. మాట్లాడాలి. భర్తతో ఎంతో మాట్లాడాలి అనిపిస్తోంది. కానీ అప్పటికే మెదడూ పెదవులూ ఆమెకి సహకరించడం మానేశాయి. ఇక తనేమీ మాట్లాడలేదని అర్థమైందామెకి. అందుకే-

''ప్చ్'' అంది. ఆ అనడంలో అంతులేని నిస్సహాయత ధ్వనించింది.

## అలాంటిదేంలేదు

**ఇదేదో ఎప్పుడూ వినే డైలాగ్‌లా ఉంది అనుకుంటున్నారా? నిజమే. ప్రముఖతార ఊర్మిళా మతోంద్కర్ చెప్పిన మాటే ఇది. 'సహచర నటులతో క్లోజ్‌గా ఉండకపోవడానికి కారణం ఏమిటి' అని అడిగితే 'అలాంటిదేం లేదు. మిగతా హీరోయిన్లలా హీరోలతో, యూనిట్ సభ్యులతో క్లోజ్‌గా ఉండడం నాకిష్టం ఉండదు. 'ఏక్ హసీనా థీ' సినిమా షూటింగ్‌లో నేను సయీఫ్ అలీఖాన్‌తో అంతగా మాట్లాడలేదని అంతా అంటున్నారు. అలా ఎవరు రాశారు, వారికే తెలుసు' అంటూ విరుచుకుపడింది ఊర్మిళా. మా ఇద్దరి మధ్య ఎలాంటి అభిప్రాయభేదాలు లేవు. మేమిద్దరం చాలా ఫ్రెండ్లీగా ఉన్నాం' అంటూ వివరణ ఇచ్చింది. అసలేం జరిగిందో?**



''మీరే ఏదయినా మాట్లాడండి'' అంది, క్షణం తర్వాత..అతని పక్కనే మీ మాప్రుడు వేలితో సున్నాలు చుడుతూ.

ఆమె అభ్యర్థన విని కాసేపు ఆగి అన్నాడతను ''చిన్నప్పట్నుంచీ నేను చాలా మితభాషిని. ఎక్కువగా మాట్లాడేవాడిని కాను. నాకసలు మాటలు రావు కూడా'' అన్నాడు.

అతని మాటలకి ఆమెకి నవ్వొచ్చింది. ఆ నవ్వు అతనికి కొద్దిగా ధైర్యాన్నిచ్చింది. దాంతో తను మాటల్ని నిర్భయంగా కంటిన్యూ చెయ్యొచ్చనిపించింది. అంతే..ఇక రెచ్చిపోయాడు. ''చిన్నప్పుడు మా బామ్మ కూడా అంటుండేది. మగాడు మితభాషి కాకూడదురా! అలా అయితే పెళ్ళాం ఆక్షేపిస్తుంది అని! ఇప్పుడు తెలుస్తోంది ఆవిడలా ఎందుకనేదో!'' చెప్పడం ఆపి ఆమె ముఖంలోకి చూశాడు.

అతనింకా ఏం చెబుతాడో వినడానికన్నట్టు ఆసక్తిగా చూస్తోంది మృదుల.

''మా బామ్మ ఎలా వుండేదో తెలుసా?'' అడిగాడు. ఆమె పొట్ట మీద ఉన్న తన చేతిని నడుము వంపులోకి జార్చుతూ!

''తెలీదు'' అన్నట్టు తల అడ్డంగా తిప్పిందామె.

''పచ్చగా..ఎత్తుగా..మెరిసిపోతూగా ఉండేది. ఎంత మడి? ఎంత ఆచారం. పోయే ఆఖరిక్షణం వరకూ వాటినలా పాటిస్తూనే ఉండేది. ఇంతకీ మా బామ్మ ఎలా పోయిందో తెలుసా?'' ఆమె నడుము వంపులో వున్న తన చేతిని అలాగే పైపైకి జరుపుతూ అడిగాడు.

ఉలిక్కిపడింది మృదుల. అతని 'చేతలకి'కాదు..మాటలకి..'మీ బామ్మ ఎలా పోయిందో అదంతా ఇప్పుడంత అవసరమా?' అనాలనుకుంది. కానీ అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. ఆమె మౌనం అతనికి ఆసక్తిగానూ అంగీకారంగానూ అపార్థమవడంతో.. 'అసలు మా బామ్మ ఎలా పోయిందంటే..' అంటూ మొదలెట్టి ఆవిడ మడిగట్టుకుని తులసికోట దగ్గర కూర్చుని జపం చేసుకుంటూ, కళ్ళు తిరిగి పడిపోయి, కోమాలోకి జారిపోయిన సంఘటన దగ్గర్నుంచీ, ఆవిడకి తన తండ్రి స్మశానంలో తలకొరివి పెట్టిన సీన్ వరకూ, అంతా చక్కగా కళ్ళకి కట్టినట్టు చెప్పుకొచ్చాడు. పనిలోపనిగా టైం వేస్ట్ చెయ్యకుండా నోటితో కబుర్లు చెబుతునే చేతుల్తో, చేతల్తో ఆమెని ప్రేరేపించాడు. అహా! అలా చేశానని అనుకున్నాడు. అటు వాళ్ళ బామ్మ చావు కథని పూర్తిచెయ్యడం, ఇటు సుభాష్‌కి వెర్రెక్కి కిర్రెక్కడం రెండూ ఒకేసారి జరిగేసరికి, ఇక ఆగలేని పాడి రంగంలోకి దిగబోయాడు.

కానీ అప్పటికే మృదుల పరిస్థితి మరో రకంగా తయారయింది. భర్త మాటలకీ చేతలకీ పొంతన కుదరకపోవడంతో ఆమెకి చచ్చేంత చిరాకొచ్చింది. చెప్పాల్సిన చావు కబుర్లన్నీ చెప్పేసి మూడ్ పాడుచేసిన అతన్ని చూసేసరికి పీకల్దాకా కోపం ముంచుకొచ్చింది. అంతే! ఆత్రంగా మీదికి రాబోతున్న భర్తని ఒక్క తోపుతోసి దిగ్గున లేచి కూర్చుంది.

దిమ్మెరబోయాడతను. ''అరెరె! ఏమిటీ? ఏమైందీ?'' కంగారుగా అడిగాడు.

అతనికి సమాధానం చెప్పకుండా లేచి తలగడ కిందేసుకుని ఒట్టి నేలమీదనే పడుకుండిపోయింది. కోపంతో ఊగిపోతున్న భార్యని ఎలా సముదాయించాలో చేతకాక, అసలామెకి కోపం ఎందుకొచ్చిందో అర్థంకాక, తనూ ముడుచుకుని పడుకుండిపోయాడు.

ఇక ఆ రాత్రంతా మృదులకి నిద్రపట్టలేదు. అసలు భర్త తత్త్వమేమిటో కూడా ఆమెకి ఓ పట్టాన అర్థం కాలేదు. కంటిమీద కునుకు లేకుండా ఆలోచిస్తే, అప్పుడు తట్టిందో ఉపాయం. ఆ మర్నాడు దాన్ని అమలులో పెట్టిందామె. ఈసారి కబుర్లని తనే మొదలెట్టింది. ఆషాఢమాసంలో తనెంత విరహాన్ననుభవించిందీ చక్కని కథలా మలచి చెప్పింది.

అంతా విన్నాడతను. వింటూనే తన అనుభవాల్ని కూడా చెప్పడం ప్రారంభించాడు. అలా చెబుతూ..చెబుతూ ఆటోమేటిగ్గానే తమ పక్కింటి వాళ్ళ అల్లుడు, ఆషాఢం విరహాన్ని ఓపలేక, పెళ్ళాన్ని చూడ్డం కోసం అత్తింటికి వస్తూ వస్తూ, దార్లో యాక్సిడెంట్‌కి గురై, తలపగిలి ఎంత దారుణంగా చచ్చిపోయిందీ కూడా చెప్పేశాడు.

ఏదో ఒకలా భర్త దార్లో పడ్డాడులే అని సంతోషించే లోపలే అతనలా టాపిక్‌ని అటు తిప్పీ, ఇటు తిప్పీ, తిరిగి 'చావు' దగ్గరకే తీసుకువెళ్ళడం ఆమెకి చచ్చేంత కోపం తెప్పించింది. అయినా నిగ్రహించుకుంది. మనుషులకి స్వాభావికంగా వచ్చే అలవాట్లు అంత తొందరగా మారిపోవు. మారకూడదు కూడా! ఏదైనా నెమ్మది మీదనే సాధించాలనే అభిప్రాయంతో సహించి ఊరుకుంది. ఏదేమైనా, 'ఏదో విధంగా' అతన్ని మార్చడానికే ఆమె కంకణం కట్టుకుంది.

ఆ విధంగా ప్రారంభమైన వాళ్ళ కొత్తకాపురం..ప్రతి రాత్రీ మూడు చావుకబుర్లూ..ఆరు స్మశానం సీన్ల వర్ణనలతో మహ'రంజు'గా సాగనారంభించింది. మొదటిరోజు వాళ్ళ బామ్మ చావు కబుర్లతో బోణీ చేసిన సుభాష్..బంధువులూ మిత్రుల చావుల గురించే కాక చుట్టుపక్కల వాళ్ళ చావుల గురించి కూడా రోజుకో కథ చొప్పున చెప్పుకొస్తుంటే, ఆ కథల్ని వినలేక, మృదులకి చెవులు చిల్లులు పడ్డాయి.


ఆ నరకాన్ని భరించలేదు. అలా అని భర్తతో గొడవకి దిగనూ లేదు. అక్కడికీ చాలాసార్లు అతన్తో చెప్పి చూసింది కూడా. ''కొత్తగా పెళ్ళయిన మనం చెప్పుకోవాల్సిన కబుర్లు ఇలాంటివి కాదు. ఇంకా చాలా ఉన్నాయి'' అని. అయినా పాపం! అతను తన పద్ధతిని మార్చుకోలేకపోయాడు.

కాలచక్రంలో నెల గిర్రున తిరిగింది. మృదుల కొత్తకాపురం ఎలా ఉందో చూద్దామని ఓరోజు వాళ్ళ అక్కా బావా వచ్చారు. వాళ్ళు, ఇంట్లోకి అడుగుపెడుతూనే మృదుల అవతారాన్ని చూసి అదిరిపోయారు. కొత్తపెళ్ళికూతురుగా ఆమె కళ్ళలో పొంగి పొర్లాల్సిన సంతోషం స్థానే మృత్యుభీతి తొంగి చూస్తోంది. ముఖంలో పూయాల్సిన సిగ్గు దొంతర్ల స్థానే పీడకళ తాండవిస్తోంది. శరీరం అణువణువునా ఉత్సాహం ఉరకలేయాల్సింది పోయి అసలు నెల్లాళ్ళనుంచీ తిండే లేనట్టుగా చిక్కిశల్యమైంది. చెల్లెల్ని ఆ పరిస్థితిలో చూసేసరికి ఆమె అక్క మంజుల కడుపు తరుక్కుపోయింది. అక్కాబావల్ని చూసేసరికి మృదులకి దుఃఖం పొంగుకొచ్చింది. ఇద్దరూ ఒకర్ని వాటేసుకుని మరొకరు 'భోరు'మన్నారు.

అలాగే అరగంట గడిచింది. ఇద్దర్లోనూ దుఃఖోద్వేగం తగ్గింది.

''అసలేం జరిగిందే? అతను నిన్నేమన్నా బాధలు పెడుతున్నాడా?'' కళ్ళు తుడుచుకుంటూ అడిగింది మంజుల.

''లేదు'' ముక్కు ఎగబీలుస్తూ చెప్పింది మృదుల.



''మరి ఏమిటిలా అయిపోయావ్?'' భృకుటి ముడేసి అడిగింది మంజుల.

అంతా పూస గుచ్చినట్టు చెప్పి, మరోసారి అక్క ఒళ్ళో తల దూర్చి భోరుమంది మృదుల. చెల్లెలి బాధ చూసి ఏడ్వాలో లేక ఆమె చెప్పిన విషయం విని పొట్ట చెక్కలయ్యేలా నవ్వాలో అర్థం కాక అయోమయంలో ఉండిపోయింది మంజుల.

ఆ సాయంత్రమే మంజుల తిరుగు ప్రయాణమైంది. వెడుతూ వెడుతూ చెల్లెలితో...''ఒరే! అయిందేదో అయిపోయింది. కొట్టేవాణ్ణి, తిట్టేవాణ్ణి ఏదో రకంగా అడ్డుకోవచ్చు. కానీ ఏ కబుర్లు మొదలెట్టినా వాటన్నిటినీ తిప్పి తిప్పి చావు దగ్గరకి తీసుకెళ్ళేవాణ్ణి ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు చెప్పు? ఇది సమస్య అనుకుంటే దీనికి పరిష్కారం నువ్వే ఆలోచించుకో. కాదు అనుకుంటే ఏ గొడవా లేదు'' అని చెప్పి మరీ వెళ్ళింది.

మంజుల రాక...అందించిన ఓదార్పు..చెప్పిన ధైర్యం..వెడుతూ, వెడుతూ చేసిన హిత బోధ..ఇవన్నీ మృదులలో చాలా మార్పుని తీసుకొచ్చాయి. ఆ క్షణం నుంచీ తేలికపడ్డ మనసతో సమస్య తాలూకు పరిష్కారం కోసం అన్వేషించడం ప్రారంభించింది. సరిగ్గా అప్పుడే...అనుకోకుండానే ఆమె సమస్యకి ఓ చక్కని పరిష్కారం లభించింది.

★ ★ ★

ఆరోజు రాత్రి యథాప్రకారం భార్యకి చావు కబుర్లు చెప్పి చెప్పి అలిసిసొలిసి నిద్రలోకి జారిపోయాడు సుభాష్. మృదుల మాత్రం నిద్రపోకుండా అలాగే కూర్చుని తనకి కావలసిన 'నేచురల్ సౌండ్ ఎఫెక్ట్' కోసం ఓపిగ్గా ఎదురుచూస్తోంది. ఆ నిరీక్షణలో పది దాటింది. పదకొండయింది. ఇక పన్నెండు కూడా దగ్గర పడుతూండగా అప్పుడు..అదృష్టం కొద్దీ ఆమె నిరీక్షణ ఫలించింది.

ఉన్నట్టుండి..ముందు సన్నగా..అటు తర్వాత కొంచెం బిగ్గరగా..మళ్ళీ మంద్రంగా..ఆరోహణ, అవరోహణాల్లో..హృదయ విదారకంగా వినిపించిందో ఏడుపు. హఠాత్తుగా వింటే..ఎవరికైనా గుండె గుభిల్లుమనేంత భయంకరంగా వినిపిస్తోందది. ఆ ఏడుపు వింటూంటే మృదుల పెదాల మీద సన్నని చిర్నవ్వు మెరిసింది.

వస్తున్న నవ్వుని అదిమిపెట్టి మోహానికి ఒకింత ఆందోళన పులుముకుంది. హాయిగా నిద్రపోతున్న భర్తని కుదిపి లేపేసింది. ఆమె కుదుపులకి కంగారు పడిపోయాడతను. ''ఏమిటీ? ఏమైందీ'' ఆతృతగా అడిగాడు.

''అది..అదుగో..వినండి ఆ ఏడుపు'' వణికి పోతూ చెప్పింది.

చెవులు రిక్కించాడతను. ముందు సన్నగా... ఆ తర్వాత కొంచెం బిగ్గరగా ఆగి..ఆగి వినిపిస్తోందో హృదయ విదారక రోదన. వింటుంటే ఎవరో ఆడది ఏడుస్తున్నట్టే ఉంది. కానీ వినడానికి చాలా భయంకరంగా ఉంది. వింటున్న అతనికి భయంతో ఒళ్ళు జలదరించింది.

''ఎవరో ఏడుస్తున్నారు కదూ!'' భార్య ముఖంలోకి చూస్తూ అన్నాడు. అవునన్నట్టు తలూపిందామె.

''పక్కింటావిడేమో!'' అన్నాడు రోజూ తాగొచ్చి గొడవ చేసే ఆవిడ మొగుణ్ణి గుర్తు తెచ్చుకుంటూ.

''కాదు..మీ వేమవరం మేష్టారి పెళ్ళాం!'' ఠక్కున అంది మృదుల.

సుభాష్‌కి గుండె ఝల్లుమంది. ఆరోజు సాయంత్రం వేడివేడి మిర్చీ బజ్జీలు చూడగానే తినాలనిపించిందతనికి. అనిపించడమే తడవుగా ఓ ప్లేటు మిర్చిబజ్జీ పొట్లం కట్టించుకొచ్చాడు. అవి తింటుంటే అతనికి హఠాత్తుగా..అత్తగారికి పెట్టకుండా తినెయ్యాలన్న ఉద్దేశంతో పది రూపాయల పచ్చిమిరపకాయ బజ్జీలు ఒక్కత్తే తినేసి, ఆ వెనక ఎడతెరిపిలేని విరోచనాల్తో హరీమన్న వేమవరం మేష్టారి పెళ్ళాం గుర్తొచ్చింది. ఆ కథనే రాత్రి పడుకోబోయే ముందు భార్యకి చెప్పాడతను. కానీ...చచ్చిపోయి ఎలా కాలమైన ఆ వేమవరం మేష్టారి పెళ్ళాం లేచొచ్చి తమ బెడ్రూం పక్కనే కూర్చుని ఎందుకేడుస్తోందో అది మాత్రం అర్థం కాలేదతనికి. ఆ మాటే అడిగాడు భార్యని ''ఆవిడ ఇక్కడికెందుకొస్తుంది?'' అని!

''మీరు పిల్చారుగా! అందుకే వచ్చింది'' విసురుగా అంది మృదుల.

ఆశ్చర్యపోయాడతను. ''నేను పిల్చానా! ఎప్పుడూ?'' అయోమయంగా అడిగాడు.

''రాత్రి పడుకోబోయే ముందు ఆవిడ చావు కథని చెప్పారుగా! అలా తల్చినా పిలిచినట్టే కద్దూ. అందుకే వచ్చి కూర్చుని ఏడుస్తోంది'' వివరించింది.

సుభాష్‌కి నోరు తడారిపోయి నాలుక పిడచకట్టుకుపోయింది. ఒళ్ళంతా చెమటలు పోశాయి. అతనికి దెయ్యాలంటే చాలా భయం. అందుకే చటుక్కున భార్యని కౌగలించుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. ''ఇప్పుడేం చెయ్యాలి?'' వణికిపోతూ అడిగాడు.

''ఇమ్మీడియేట్‌గా ఆంజనేయ దండకం చదువుకోవాలి''

''నాకు రాదే!''

''నాకొచ్చు నేనున్నాగా! భయపడకండి'' భర్తని పొదివిపట్టుకుని ధైర్యం చెప్పి, ఆంజనేయ దండకం చదవడం మొదలెట్టింది. ఆ తర్వాత ఓ పావుగంటకే ఆ ఏడుపు సద్దుమణిగింది. అంతే. అది లగాయితూ రాత్రేకాదు, పగలు కూడా చావు కబుర్లు చెప్పడం మానేశాడు సుభాష్. ఆ తర్వాత ఆంజనేయ దండకం నేర్చుకున్నాడు కూడా!

ఇంతకీ అసలు 'రహస్యం' ఏమిటంటే...ఆ ఏడుపు మగపిల్లిది. అదసలు ఏడుపు కూడా కాదు. 'జత' కోసం పరితపించిపోతూ జంట కట్టడానికై, ఆడపిల్లిని గోముగా, గారంగా, పిలిచే పిలుపది. కానీ హఠాత్తుగా అస్పష్టంగా విన్నవాళ్ళెవరికైనా అది హృదయవిదారకమైన ఏడుపులానే వినిపిస్తుంది.

ఆరోజు మిట్టమధ్యాహ్నం ఆలోచనల్లోపడి కొట్టుకుపోతున్న మృదులకి గండుపిల్లి పెట్టిన ఆ కూత వినిపించింది. అప్పుడే మెరుపులా వచ్చిందా ఆలోచన. ఇంటి చుట్టుపక్కల తిరుగుతున్న గండుపిల్లి ఏదో ఓ సందర్భంలో మళ్ళీ అలా గోల చేస్తుందన్న విషయం ఊహించే పకడ్బందీగా ఓ ప్లాన్ ఆలోచించి పెట్టుకుంది. పిల్లికూత వినగానే దాన్నే అమల్లో పెట్టింది.

ఊహించినట్టుగానే ఆ సంఘటన తర్వాత సుభాష్‌లో చాలా మార్పొచ్చింది. అది చూసి మృదుల సంతోషించిందే తప్ప పొరపాటున కూడా అసలు నిజం అతనికి చెప్పలేదు. ఇక ముందు చెప్పదు కూడా! ఎందుకంటే వంద అబద్ధాలాడి ఓ పెళ్ళి చేసినట్టే వెయ్యి నాటకాలు వేసయినా సరే ఎవరి దాంపత్య జీవితాన్ని వాళ్ళు సారవంతం చేసుకోవాలి మరి. అదన్నమాట సంగతి!

☆

